

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

- రక్తదాతలను సన్మానించిన కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

రక్తదానం ప్రాణదానంతో సమానమని అది జీవితాన్ని కాపాడుతుందని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషాఅన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కెజి.గోవింద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రక్తదాతలను జిల్లా కలెక్టర్ సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ నోబెల్ విజేత కార్ల్ లాండ్‌స్టీనర్ తొలిసారిగా రక్తాన్ని వర్గీకరించారని, ఆయన జయంతికి గుర్తుగా జూన్14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. మొదటిసారిగా 2004 నుండి డబ్ల్యుహెచ్ఒ ఆదేశాల మేరకు ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. రక్తదానం ఎంతో విలువైనదని ప్రమాదాలు సంభవించినప్పుడు వారికి రక్తం చాలా అవసరం అవుతుందని అన్నారు. రెగ్యులర్‌గా రక్తదానం చేసే దాతలకు సెల్యూట్ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రక్తదానం ఆరోగ్యానికి కూడా మంచిదని, రక్తం ఇవ్వడం ద్వారా ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని తెలిపారు. ఈ సంవత్సరం 'బ్లడ్ ఇవ్వండి - లైఫ్ హోఫ్ ఇవ్వండి అందరం కలిసికట్టుగా ప్రాణాలు కాపాడుదాం' అనే థీమ్ ఇచ్చారని అన్నారు. దేశంలో ప్రతి ఏటా ఐదు కోట్ల యూనిట్స్ అవసరమైతే రెడ్ క్రాస్ సొసైటీ ఇతర సంస్థల ద్వారా 3.5 కోట్ల యూనిట్స్ రక్తం మాత్రమే రక్తదానం చేస్తున్నారన్నారు. 70 శాతం మందికి మాత్రమే అందుతుందని మిగిలిన 30శాతం మంది అందక చనిపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో 6.5 లక్షల యూనిట్స్ అవసరమైతే నాలుగు లక్షల యూనిట్స్ మాత్రమే అందుతుందని, కర్నూలు జిల్లాలో 45 వేల యూనిట్స్ అవసరమైతే 35 యూనిట్స్ మాత్రమే రక్తం అందుతుందని 10 వేల యూనిట్ల కొరతగా ఉందని తెలిపారు. ఈ సంవత్సరం దీనిని ఛాలెంజ్‌గా తీసుకొని కాలేజీలలో యువతలో ఇతరులలో అవగాహన కల్పించి 100 శాతం రక్తం అందేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతి కళ మాట్లాడుతూ రక్తదానం వల్ల కలిగే లాభాలు చాలా ఉన్నాయని, ఒక వ్యక్తి రక్తం ఇవ్వడం ద్వారా శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. మెడికల్, సర్జికల్, ఎమర్జెన్సీ విభాగలలో రక్తం చాలా అవసరమవుతుందన్నారు. గర్భవతులకు, బాలింతలకు, తల సేమియా బాధితులకు రక్తం చాలా అవసరమని అన్నారు. ఈరోజు 60 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కెజి.గోవింద్ రెడ్డి మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ దాతల నుంచి రక్తాన్ని సేకరించి 30 శాతం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు, 20 శాతం తల సేమియా వ్యాధిగ్రస్తులకు ఇస్తున్నారన్నారు. రక్తదానం చేయడం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు రక్తదానం చేసి కలెక్టర్ చేతుల మీదుగా సీల్డ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మహేంద్ర, కార్యదర్శి శ్రీనివాసులు, ఎఎస్ఐఇసి సభ్యులు డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ రామ్మోహన్ నాయుడు, డాక్టర్ కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కెవి సుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా రక్తదానం

అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) ఇసి మెంబర్స్ డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, కర్నూల్ సిటీ అధ్యక్షులు సర్జరీ విభాగపు హెచ్ఒడి, ప్రొఫెసర్ డాక్టర్ హరి చరణ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ కోటిరెడ్డి , పీజీ విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి కలెక్టర్ పి.రంజిత్ బాష జ్ఞాపికలు అందుజేశారు. ఈ కార్యక్రమంలో సర్జరీ విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ మాధవి శ్యామల, డాక్టర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.



అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్‌ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రక్తదానం చేసిన డాక్టర్స్‌ను సన్మానిస్తున్న కలెక్టర్



రక్తదానం చేసిన సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడును సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

స్కూలు బస్సు భద్రమేనా..?

- విద్యాసంస్థల బస్సులు నిబంధనలు గాలికి
- గడువు ముగిసినా ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందని యాజమాన్యాలు
- యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్న వైనం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

విద్యాసంస్థల్లో విద్యార్థుల రవాణా కోసం వినియోగించే బస్సుల్లో రక్షణ ప్రశ్నార్థకంగా మిగులుతుంది. ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందనిదే అలాంటి బస్సులు రోడ్లపై తిరగకూడదు. కానీ జిల్లాలో పలు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందకుండానే బస్సులను నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

వేలకు వేలు ఫీజులు దండుకునే ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. అందుకు బస్సు నిర్వహణలో వ్యవహరించే తీరే అద్దం పడుతుంది. విద్యార్థుల రవాణా కోసం వినియోగించే బస్సుల్లో అనుసరించాల్సిన నియమ నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి. ప్రైవేటు విద్యా సంస్థల బస్సులను ప్రతి ఏడాది వాటి సామర్థ్యాన్ని నిర్ధారించుకునేందు కు ఆర్‌టిఒ ఆఫీసులో ఎంవిఐ ద్వారా ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను పొందాల్సి ఉంది. ఈ పరీక్షల్లో ఎంవిఐ బస్సును పూర్తిగా పరిశీలించి నిబంధనలకనుగుణంగా అన్ని సక్రమంగా ఉన్నాయని నిర్ధారించాకే ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను అందజేస్తారు. అప్పుడే ఆ బస్సు రోడ్డుపై తిరగాల్సి ఉంటుంది.

జిల్లాలో కర్నూలు ఆర్‌టిఎ కార్యాలయ పరిధిలో 556, ఆదోని ఆర్‌టిఎ కార్యాలయ పరిధిలో 97 చొప్పున జిల్లాలో మొత్తం 653 ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఇందులో ఇప్పటివరకు కర్నూలు ఆర్‌టిఎ పరిధిలో 409, ఆదోని ఆర్టిఎ పరిధిలో 59 చొప్పున మొత్తం 468 బస్సులు మాత్రమే ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను పొందాయి. ఇంకా 185 బస్సులు ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను పొందలేదు. ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందడానికి మే 15వ తేదీని ప్రతి ఏడాది చివరి గడువుగా రవాణా శాఖ నిర్ణయించింది. జూన్ మాసం పూర్తయినా ఫిట్నెస్ సర్టిఫికెట్లు విద్యాసంస్థల యాజమాన్యాలు పొందకపోవడం పట్ల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్యం బస్సు నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు

పాఠశాల బస్సులు తప్పనిసరిగా పసుపు రంగులో ఉండాలి.బస్సు ముందు, వెనుక, ఎడమ వైపు పాఠశాల పేరు, చిరునామా, ఫోన్ నంబర్లు స్పష్టంగా కనిపించేలా రాయాలి. బస్సు సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదు. ప్రతి విద్యార్థికి సీటు ఉండాలి. చిన్నారులు సులువుగా ఎక్కి, దిగేందుకు వీలుగా బస్సు మెట్లు ఉండాలి. మెట్లు 325 మిల్లీ మీటర్ల ఎత్తుకు మించకూడదు. పట్టుకోవడానికి రెయిలింగ్ రాడ్ ఉండాలి. బస్సు లోపల, బయట ఇరువైపులా సైడ్ అద్దాలు అమర్చాలి. డ్రైవర్ విద్యార్థులను వెనుక నుంచి వస్తున్న వాహనాలను గమనించడానికి అవి ఉపయోగపడతాయి. లోపల డ్రైవర్‌కు కనిపించే విధంగా పెద్ద పారదర్శక అద్దం ఉండాలి. విద్యార్థులు కిటికీల నుంచి చేతులు బయటకు పెట్టకుండా కిటికీలకు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. బస్సుకు అత్యవసర ద్వారం తప్పనిసరిగా ఉండాలి. అది సులభంగా తెరుచుకునేలా ఉండాలి. దానిపై 'అత్యవసర ద్వారం' అని స్పష్టంగా రాయాలి. అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఆర్పేందుకు ఫైర్ ఎస్టింగిషర్లు బస్సులో అందుబాటులో ఉండాలి. బస్సులో ప్రథమ చికిత్స పెట్టె తప్పనిసరిగా ఉండాలి. అందులో అవసరమైన పరికరాలు మందులు ఉండాలి. బస్సులోని సీట్ల మధ్య ఖాళీ ప్రదేశంలో, విద్యార్థులు నడిచే వైపు కాళ్లకు దెబ్బలు తగలకుండా కింది భాగంలో మ్యాట్ ఉండాలి. విద్యార్థులు తమ బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. బస్సుల డోర్లు సురక్షిత లాకింగ్ సిస్టమ్ తో అమర్చాలి. బస్సుకు సంబంధించి బ్యాటరీ, వైపర్స్, రెండువైపులా ఇండికేటర్లు పనిచేసేలా చూసుకోవాలి. బస్సులో 60 సంవత్సరాలు పైబడిన వ్యక్తిని డ్రైవర్‌గా ఉపయోగించరాదు. డ్రైవర్‌కు కనీసం ఐదు ఏళ్ళ అనుభవం తప్పనిసరి ఉండాలి. ప్రతి మూడు నెలలకోసారి డ్రైవర్‌కు యాజమాన్యం ఆరోగ్య, కంటి పరీక్షలు చేయించాలి. డ్రైవర్ తో సహా ఒక అటెండరు బస్సులో ఉండాలి.

ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి



ప్రతి విద్యా సంస్థ బస్సు తప్పనిసరిగా ఫిట్నెస్ సర్టిఫికెట్ను తీసుకోవాలి. అది లేకుండా బస్సును రోడ్డుపై నడపరాదు. అలా నడిపితే చర్యలు తీసుకుంటాం.

-ఎల్ భరత్ చవాన్, ఆర్‌టిఒ కర్నూలు

ఏడాదికి 'తల్లికి వందనం'

ప్రజాశక్తి-కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

తల్లికి వందనం పేరుతో ప్రతి బిడ్డకూ రూ.15వేల చొప్పన తల్లి ఖాతాలో జమ చేస్తామని ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక పథకం అమలు అప్పుడు ఇప్పుడు అంటూ చివరికి తొలి ఏడాది మొండిచేయి చూపి ఎట్టకేలకు ఏడాది దాటాక తల్లుల ఖాతాల్లో జమ చేశారు. చెప్పిన దాంట్లో రూ.2 వేలు కోత పెట్టి రూ.13 మాత్రమే జమ చేశారు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు మరిన్ని నిబంధనలతో మార్గదర్శకాలు విడుదల చేశారు. లబ్ధిదారుల్లో అసహనం వ్యక్తమవుతోంది...

కర్నూలు జిల్లాలో 3,67,614 మంది విద్యార్థులను అర్హులుగా ప్రకటించారు. వారికి సంబంధించిన తల్లికి వందనం డబ్బులను వారి తల్లుల ఖాతాల్లో ఈనెల 13 నుంచి జమ చేయడం ప్రారంభించారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 3,14,036 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి తల్లికి వందనం విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేయడం ప్రారంభించారు. చెప్పినట్లు రూ.15వేలు కాకుండా రూ.13 వేలు మాత్రమే జమ చేశారు. రూ.2 వేలను పాఠశాల అభివృద్ధి కోసం కోత విధిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కూటమి ప్రభుత్వం తీరుపైన లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల్లో మరిన్ని నిబంధనలు విధించారు. వచ్చే ఏడాదికి నిబంధనలు అమలు చేస్తే సగానికి సగం విద్యార్థులకు పథకం వర్తించకపోవచ్చు.

ప్రజల 'యోగ' క్షేమాలు గాలికి: జూన్ 21న విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటున్న నరేంద్ర మోడీ కార్యక్రమానికి ముందస్తుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నెలరోజులపాటు ఆర్భాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆదేశాలు జారీ చేసింది. అసలు విధులను నిర్వర్తించకుండా ఉద్యోగులు, అధికారులు ఈ కార్యక్రమంలోనే పాల్గొంటున్నారు. కార్యాలయాలకు పనుల నిమిత్తం వెళ్లినా ప్రజలకు అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఎందుకింత ఆర్భాటం.. ఒక పక్క మున్సిపల్ కార్మికులు ఇంజనీరింగు కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తున్నారు. వారి గురించి ఎవరూ పట్టించుకోరు. విశాఖపట్టణంలో 2500 మంది కాంట్రాక్టు కార్మికులను విధులనుంచి తొలగించారు. వారిని పనిలోకి తీసుకోవాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ల ప్రయివేటీకరణ ఆపాలని కార్మిక సంఘాలు ఆందోళన చేస్తున్నా పట్టించుకోరు. మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన చేస్తున్నా స్పందించరు. పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయుల బదిలీల వ్యవహారం తేలలేదు. విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా బదిలీల వ్యవహారంలో ఉంటే ఎలా....ఈ సమస్యపై ఉపాధ్యాయులు ఆందోళనలు చేస్తున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ పనుల్లో నాణ్యత లోపించి కాలువకు గండి పడింది. ఉపాధి కూలీలకు నెలల తరబడి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఇవన్నీ పక్కన బెట్టి యోగాంధ్ర సంబరాలేంటి. ప్రజలకు యోగా చేసుకోవడం తెలువదా సమస్యలను పక్కదారి పట్టించేందుకు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు యోగాసనాల పేరుతో, రిజిస్ట్రేషన్ పేరుతో సిబ్బందిని కేటాయించి, నిధులు కేటాయించి చేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంత హంగామా అవసరమా అంటున్నారు.

ప్రమాణ స్వీకారాలు : కెడిసిసిబి కర్నూలు ఉమ్మడి చైర్మన్‌గా కోడుమూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. పత్తికొండ, పాణ్యం, నంద్యాల, నందికొట్కూరు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్‌లుగా ప్రమాణస్వీకారం చేశారు. బదిలీ అయిన తహశీల్దార్లు, హెచ్ఎంలు, ఇతర అధికారులు విధులలో చేరారు.

ఫలితాలు విడుదల: ఎస్ఎస్‌సి, ఇంటర్ సప్లిమెంటరీ, ఎపి ఇఎపి సెట్, నీట్ ఫలితాలు ఈవారంలో విడుదలయ్యాయి.

ఏరువాక పౌర్ణమి: ఏరువాక పౌర్ణమి రైతులు ఉత్సాహంగా నిర్వహించారు. అదేరోజు జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడు పాణ్యం నియోజకవర్గంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్నారు. అరక పట్టి దున్నారు. పాణ్యం ఎమ్మెల్యే విత్తనం వేశారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గంలో పాల్గొని రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఎపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించారు.



కూటమి ప్రభుత్వ ఏడాది సంబరాలు : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఉమ్మడి జిల్లాలో సంబరాలు చేసుకున్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ.జనార్ధన్‌రెడ్డి నాయకత్వంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. నంద్యాలలో న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూక్, కర్నూలులో కార్మిక శాఖమంత్రి టిజి.భరత్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ఏడాదిలో చేసిన పనుల గురించి వివరించారు.

టెన్త్, ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం: టెన్త్, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరిట అవార్డులు ప్రదానం చేశారు. నంద్యాల జిల్లాలో 182 మంది పదవ తరగతి విద్యార్థులకు, 35 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు , కర్నూలు జిల్లాలో 142 మంది పదవ తరగతి విద్యార్థులకు, 35 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. మెరిట్ సర్టిఫికెట్లు, రూ 20 వేల నగదురు అందజేశారు. మంత్రులు, కలెక్టర్లు, డిఇఒ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



విజయ సంకేతం చూపుతున్న శ్రీచైతన్య విద్యార్థులో ఎజిఎం , అధ్యాపకులు

నీట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విజయకేతనం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నేడు విడుదలైన నీట్ -2025 పరీక్షా ఫలితాలలో కర్నూలు శ్రీ చైతన్య విద్యార్థులు అద్వితీయమైన ప్రతిభ కనబరచి ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాలల ఎజిఎం మురళీకృష్ణ తెలిపారు. ఇప్పటి వరకు అందిన ప్రాథమిక సమాచారం మేరకు ఆలిండియా స్థాయిలో తమ విద్యార్థులు ఎన్.హరినాయక్ 2295 వర్యాంకు, ఎం.అజయ్ 2791 వ ర్యాంకు, ఎన్ఎం.ముసాదిక్ బిలాల్ 4508 వ ర్యాంకు, ఎమ్. రవిత్రయని 5755 వ ర్యాంకు, కె.ప్రేమ్ కుమార్ 7456వ ర్యాంకు, వై.కీర్తన 7557 వ ర్యాంకు, బి.వశిష్ట క్రిష్ణ 8336వ ర్యాంకు, బి.సాయి దీపక్ 9084 వ ర్యాంకు, జె.వంశి 9700వ ర్యాంకు, ఎస్.సమీర్ 10018 వర్యాంకు, డి. లాస్య నందిని 10676 వర్యాంకు, యు.తారాచందు 11056 వ ర్యాంకు, ఎమ్.శుశ్రుత్ 18688 వర్యాంకు, బి.జగదీశ్ 23229 వర్యాంకు, ఎస్.నిజాముద్దీన్ సర్దార్ 23341 వర్యాంకు, ఎస్.ఫౌజియా 27626 వ ర్యాంకు, డి.ప్రవల్లిక 27785 వర్యాంకు, బి.లక్ష్మీకాంత్ 28973 వర్యాంకు లాంటి ఎన్నో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో తెలిపారు. ఈ ర్యాంకులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను సహకరించిన తల్లిదండ్రులను, ఈ ఫలితాలను సాధించడానికి తోడ్పడిన అధ్యాపకులను కళాశాలల ఎజిఎం.మురళీకృష్ణ, డీన్స్ సరళగారు, బాలాజీ అభినందించారు.



కర్నూలు బస్టాండ్‌ను కడప జోనల్ చైర్మన్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్ఆర్‌టిసి కడప జోనల్ చైర్మన్ పూలనాగరాజు కర్నూలు బస్టాండ్‌ను శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని ప్రయాణికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చొరవతో బస్టాండ్‌లోని వసతులు మెరుగుపడ్డాయని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారన్నారు. అనంతరం కర్నూల్-2 డిపో క్యారేజీలో మొక్కలను నాటారు. గ్యారేజ్‌లో కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను జోనల్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుల సమస్యల పట్ల నాగరాజు సానుకూలంగా స్పందించారు. సంస్థ పరిధిలోని కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా ప్రజా రవాణా అధికారిని ఆదేశించారు ఆయన వెంట ప్రజా రవాణా అధికారి టి శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

ఉర్దూ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తాం

-పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు
-ఉస్మానియాలో భవనాలను ప్రారంభించిన మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



ఉస్మానియాలో భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి టిజి.భరత్

కర్నూలులోని ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పరిశ్రమల శాఖమంత్రి టిజి.భరత్ పేర్కొన్నారు. అలాగే జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమలు రాబోతున్నాయని, వీటి ద్వారా అనేకమందికి ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయన్నారు. శనివారం కర్నూలు ఉస్మానియా కాలేజీ ఆవరణలో నిర్మించిన రాష్ట్రీయ ఉచ్ఛతర శిక్ష అభియాన్ (రూసా) ఆధ్వర్యంలో రూ.ఒక కోటితో నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని మంత్రి టీజీ భరత్ , కర్నూలు ఎంపీ బస్తీపాటి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కళాశాల సెక్రటరీ హజ్ర జావిద్‌లు ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ సమీవుద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఉస్మానియా కళాశాల పూర్వపు విద్యార్థి అయిన నేను రాష్ట్ర మంత్రిగా రూసా నిర్మించిన అదనపు తరగతుల భవనాలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కళాశాలలో మంచి అనుభవం ఉన్న సిబ్బంది ఉన్నారని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఎంపీ బస్తిపాటి నాగరాజును ఉద్దేశించి లెక్చరర్‌గా అనుభవం ఉన్న మీరు ఈ కాలేజీ విద్యార్థులకు లెక్చరర్‌గా , మెంబర్ అఫ్ పార్లమెంట్‌గా ఉన్న మీ అనుభవాన్ని విద్యార్థులతో పంచుకోవాలని మంత్రి కోరారు. ఉన్నత విద్యారంగా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల కోరిక మేరకు ఉస్మానియా కళాశాలలో వాకింగ్ ట్రాక్ నిర్మించే చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. కర్నూలు నగరంలో త్వరలోనే రోడ్ల వెడల్పు కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ సిఎంచంద్రబాబు కర్నూలు పర్యటనకు వచ్చినప్పుడు ఉర్దూ వర్సిటీ స్థలాన్ని చూపించామని అన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి కషి చేస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జీజీ .భరత్ , ఎంపీ బస్తిపాటి నాగరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూస ఇంచార్జ్ డాక్టర్ ఎస్.గజని, కార్పొరేటర్ పరమేష్ , కళాశాల సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎస్‌సి నియామకాలు వెంటనే చేపట్టాలి

-యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ప్రక్రియ లో భాగంగా నియామకాలు వెంటనే చెప్పటాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ మాట్లాడుతూ అనేక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. డిఎస్‌సి నియామకం ద్వారా ఆ పాఠశాలలో ఉపాధ్యాయులను త్వరగా నియమించాలన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలలో పిఇటి పోస్టులను కూడా వెంటనే నియమించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ ఆర్థిక బకాయిలను కూడా విడుదల చేయాలన్నారు. కొత్త పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసి వేతన సవరణ చేపట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ ,నవీన్‌పాటి సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి యెహోషువ, కార్యదర్శులు బాబు, సీనియర్ నాయకులు సర్వేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్

మెడికవర్‌లో ఫాదర్స్‌డే ప్రత్యేక హెల్త్ చెకప్ ఆఫర్లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఈనెల 14 ఫాదర్స్ డేను పురస్కరించుకుని, కర్నూలు మెడికవర్ హాస్పిటల్స్‌లో ఒక ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమం-'గిఫ్ట్ గుడ్ హెల్త్' ప్రారంభించారు. సమాజంలో ఆరోగ్యం పట్ల అవగాహనను పెంపొందించడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమం, మెడికవర్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు , స్నేహితుల కోసం ప్రత్యేక తగ్గింపు ధరల వద్ద ఆరోగ్య పరీక్ష ప్యాకేజీలను అందిస్తోంది. ముందస్తు ఆరోగ్య నిర్వహణ ప్రాముఖ్యతను గుర్తించి, మెడికవర్ కర్నూల్ కింది ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తోంది.

మాస్టర్ హెల్త్ చెకప్ (పురుషులు/మహిళలు): అసలు ధర రూ.15,000 కాగా ఇప్పుడు కేవలం రూ.2,900 కే అందుబాటులో ఉంది. హార్ట్ చెకప్ ప్యాకేజీ అసలు ధర రూ.4,000 కాగా, ఇప్పుడు కేవలం రూ.600 కే అందుబాటులో ఉంది. డయాబెటిక్ స్క్రీనింగ్ ప్యాకేజ్ అసలు ధర రూ.1,500 కాగా, ఇప్పుడు కేవలం రూ.300 కే అందుబాటులో ఉంది. చిల్డ్రన్స్ స్పెషల్ హెల్త్ ప్యాకేజ్ అసలు ధర రూ.2,800 కాగా, ఇప్పుడు కేవలం రూ.350 కే అందుబాటులో ఉంది. మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు సెంటర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి , డాక్టర్ ఎన్.చైతన్య కుమార్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ ఈ ప్యాకేజీలను లాంచ్ చేసారు. సెంటర్ హెడ్ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, "ఈ ఫాదర్స్ డే సందర్భంగా, మీ తండ్రికి , ప్రియమైన వారికి మీరు ఇవ్వగలిగే అత్యుత్తమ బహుమతి- ఆరోగ్యం ఇవ్వాలని మేము కోరుకుంటున్నామన్నారు. ఈ సమగ్రమైన సరసమైన ప్యాకేజీలు మా సమాజ ఆరోగ్యం పట్ల మా నిబద్ధతను తెలియజేస్తాయని అన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్లు జూన్ 15 నుండి జులై 15, 2025 వరకు ఉంటాయన్నారు. ఈ ఫాదర్స్ డేని ప్రేమ ఆరోగ్యంతో జరుపుకుందాం! మరిన్ని వివరాలకు లేదా బుకింగ్‌కు ఈసెల్‌కు 040 6833 4455 సంప్రదించాలని మహేశ్వర్‌రెడ్డి కోరారు.



ఆఫర్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి, డా॥ చైతన్య



విజయసంకేతం చూపుతున్న విద్యార్థులతో డిజిఎం, డీన్‌లు, అధ్యాపకులు

నీట్ ఫలితాల్లో ' నారాయణ' టాప్ ర్యాంకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జాతీయ పరీక్షా సంస్థ ప్రకటించిన నీట్ ఫలితాలు-2025లో జాతీయ స్థాయి ర్యాంకులలో కర్నూలు నారాయణ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని కర్నూలు నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ పి.లింగేశ్వర రెడ్డి ప్రకటించారు. విద్యార్థి ఆర్.గోవర్ధన్‌చౌదరి 621 మార్కులతో ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకులో 431వ ర్యాంకు, క్యాటగిరిలో 281వ ర్యాంకు సాధించగా, డి.హేమసాగరిక ఆల్‌ఇండియా ఓపెన్‌లో 1721ర్యాంకు, క్యాటగిరిలో44వ ర్యాంకు సాధించి టాపర్లుగా నిలవగా ఇతర విద్యార్థులు కూడా అద్భుత ప్రదర్శనతో, సఫా సైఫ్ ఖురేషి ఆల్ ఇండియా ర్యాంకు-2814 క్యాటగిరిలో 1505 ర్యాంకు, ఎం.అఖిల్ బాలాజీ నాయక్ ఆల్ ఇండియా ర్యాంకు 4169, క్యాటగిరిలో 27 ర్యాంకు , ఎస్ సంహిత ఆల్ ఇండియా ర్యాంకు 4970, క్యాటగిరిలో-2453, సాయి ఫణేంద్ర ఆల్ ఇండియా ర్యాంకు-5369, క్యాటగిరిలో 126, ఎమ్ కార్తిక్ ఆల్ ఇండియా ర్యాంకు 8421, క్యాటగిరిలో-3468, జయంశ ఆల్ ఇండియా ర్యాంకు 11587, క్యాటగిరిలో 4926, దీపిక ఆల్ ఇండియా ర్యాంకు-14962, క్యాటగిరిలో-335, ప్రశందీప్ ఆల్ ఇండియా ర్యాంకు-15548, క్యాటగిరిలో-353, గురుపార్థివ్ ఆల్‌ఇండియా ర్యాంకు 18657, క్యాటగిరిలో-419, వజీహ ఆల్ ఇండియా ర్యాంకు-18874, క్యాటగిరిలో-7818, ప్రణవ్ ఆల్ ఇండియా ర్యాంకు-19841, క్యాటగిరిలో-8182, సాయి సృజన ఆల్ ఇండియా ర్యాంకు 20007, క్యాటగిరిలో 8247 వంటి ర్యాంకులు సాధించారు.జాతీయ స్థాయిలో 500 లోపు 1 ర్యాంకు, 5,000 లోపు 5 ర్యాంకులు, 10,000నుంచి 75,000 లోపు 34 ర్యాంకులు, 1,00,000 లోపు 88 ర్యాంకులు సాధించారు. వివిధ క్యాటగిరీలలో 50 లోపు 2 మంది, 500 లోపు 7 మంది, 1,000 లోపు 9 మంది, 5,000 లోపు 25 మంది, 10,000 లోపు 33 మంది, 50,000 లోపు 100 మంది విద్యార్థులు ర్యాంకులు పొందారు. నారాయణ యాజమాన్యం అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరినీ సన్మానించింది. కళాశాల డిజిఎం టి.గోవర్ధన్‌రెడ్డి, డీన్లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ప్రిన్సిపల్స్ కె. హవీల సమ్రాట్, టి. కౌసల్య, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఒకరి గడ్డి వాము దగ్ధం -మరొకరిది పాక ధ్వంసం

పోలీస్ పికెటింగ్ ఉన్నా... అనుకోని సంఘటనలు

ప్రజాశక్తి -సి బెళగల్

మండలంలోని బ్రాహ్మణదొడ్డిలో సర్పంచికు చెందిన గడ్డి వాము దగ్ధమైంది. అదే గ్రామంలో మేకల రాముడుకు చెందిన మూగ జీవాల కోసం వేసుకున్న పాక , బండలను ధ్వంసం చేశారు. ఆ గ్రామంలో గతంలో ఇరు వర్గాల ఘర్షణల కారణంగా పోలీస్ పికెట్ ఉంది. అయినా కూడా ఒక వర్గానికి చెందిన వారివి ధ్వంసం చేయడంతో ఎస్ఐ పరమేష్ నాయక్ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే చేశారా...అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.


చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చేగువేరా జీవితం యువతకు ఆదర్శం


- డివైఎఫ్ఐ నాయకులు - ఘనంగా చేగువేరా జయంతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేగువేరా జీవితం నేటి యువతకు ఆదర్శమని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, డివైఎఫ్ఐ మాజీ నాయకులు గోవిందు తెలిపారు. శనివారం పట్టణంలోని తేరు బజార్‌లో ఉన్న సుందరయ్య భవన్‌లో చేగువేరా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువ వైద్య విద్యార్థిగా చేగువేరా దక్షిణ అమెరికా అంతటా ప్రయాణించారని, ఆయన పేదరికం, ఆకలి, వ్యాధులను చూసి ఆశ్చర్యపోయారని తెలిపారు. యునైటెడ్ స్టేట్స్ లాటిన్ అమెరికాను పెట్టుబడిదారి దోపిడీగా భావించారని, లాటిన్ అమెరికా పెట్టుబడుదారులందరినీ అంతం చేసి ప్రపంచానికే ఒక ఐకాన్‌గా నిలబడిన విప్లవకారుడు చేగువేరా అని కొనియాడారు. అలాంటి వారిని గుర్తు చేసుకుంటూ భారతదేశంలో పెట్టుబడిదారి దోపిడీకి గురవుతున్న కార్మికులను ఏకం చేసి అలాంటి పోరాటం ఫలితం తీసుకురావాలని యువతను కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటి దాకా నిరుద్యోగ భృతి కానీ, రాష్ట్రంలో, జిల్లాల్లో పరిశ్రమలను ఎక్కడా పూర్తి చేయలేదని విమర్శించారు. యువతకు ఉపాధి కల్పించే వరకు పోరాటం చేయాలని కోరారు. డివైఎఫ్ఐ నాయకులు రాకేష్, భీమేష్, మణికంఠ, వీరేష్, రాముడు, ఎల్లన్న పాల్గొన్నారు.

పేద రోగులకు సిఎం రిలీఫ్ వరం

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు


మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆర్థిక స్తోమత లేని రోగులకు మెరుగైన వైద్యం కోసం సిఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. శనివారం మీనాక్షి నాయుడును కలిసి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు గిడ్డయ్య మాట్లాడారు. ఆదోని మండలం చిన్న పెండేకల్ గ్రామానికి చెందిన తాను గత నెల లివర్ సమస్యలతో ఇబ్బందులు పడ్డానని తెలిపారు. వైద్యుల సలహా మేరకు ఆపరేషన్ అవసరమని.. సహాయం చేయాలని మీనాక్షి నాయుడును సంప్రదించినట్లు చెప్పారు. వెంటనే సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేయగా రూ.10 లక్షలు మంజూరయిందని తెలిపారు. లివర్ ఆపరేషన్‌కు అవసరమైన లివర్ తన కుమారుడు ఇచ్చాడని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మీనాక్షి నాయుడుకు, టిడిపి సీనియర్ ఉమాపతి నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాప్రతినిధులకు వేతనాలివ్వాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి-ఆలూరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

రాష్ట్రంలోని మండల, గ్రామ ప్రజా ప్రతినిధులు జడ్‌పిటిసి, ఎంపిపి, సర్పంచులు, ఎంపిటిసిలకు పెండింగ్‌లో ఉన్న 18 నెలల వేతనం ఇవ్వాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి కోరారు. శనివారం ఆలూరు గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, అంగన్వాడీ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెండింగ్ పెట్టి ఆ నిధులను తల్లికి వందనం పథకానికి మళ్లించారని తెలిపారు. గ్రామ పంచాయతీలకు 15వ ఫైనాన్స్ నిధులను కూటమి ప్రభుత్వం ఏం చేసిందో తెలియని పరిస్థితి ఉందని విమర్శించారు. సర్పంచులకు నిధులు ఇస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. గ్రామాల్లో వేసిన సిసి రోడ్లకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్లు మారయ్య, మల్లికార్జున, జడ్‌పిటిసి కిట్టు పాల్గొన్నారు.

మళ్లీ మొదటికొచ్చిన సమస్య

- తీరని చెట్నిహళ్లి శ్మశాన స్థల సమస్య
- గ్రామంలో అధికారులకు చుక్కెదురు
- శ్మశాన వాటికకు కంచె వేయద్దంటూ బైఠాయింపు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో శ్మశాన వాటిక సమస్య మళ్లీ మొదటికొచ్చింది. శ్మశాన విషయంలో ఏర్పడిన వివాద పరిష్కారానికి కంచె వేసే నిర్ణయంపై గ్రామస్తుల నుంచి సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహశీల్దార్ ఎస్.రవి, డీఎస్పీ ఉపేంద్ర బాబు, సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్‌కు చుక్కెదురైంది. శ్మశాన స్థలంపై గత 6 నెలలుగా గ్రామంలో ఉన్న ఎస్సీలు, బీసీల మధ్య ఆందోళన జరుగుతూనే ఉంది. సమస్యను పరిష్కరించేందుకు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్ర బాబు ఆధ్వర్యంలో గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు బలగాలు ఎక్కడి వారిని అక్కడే నిలిపి ఇరువర్గాల వారికి ఇబ్బంది లేకుండా 0.47 సెంట్ల భూమికి కంచె వేయాలని శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రయత్నం చేశారు. కేవలం 20 నుంచి 25 అడుగుల వరకు మాత్రమే ఎస్సీ వర్గాల వారు ఉన్న ఇళ్ల వైపు కంచె వేయాలని లేదా అందరూ కలిసిమెలిసి గతంలో ఉన్న మాదిరిగానే ఉంటామని బీసీ మహిళలు శ్మశానం చేరుకొని బైఠాయించారు. ఎంత చెప్పినా ససేమిరా అనడంతో విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో జెసి డాక్టర్ బి.నవ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గ్రామం ప్రశాంతంగా ఉండాలనే ఉద్దేశంతో కంచె వేసే ప్రయత్నం చేస్తున్నామని, సహకరించాలని కోరారు. ఆమె మాటలను కూడా పెడచెవిన పెట్టారు. చివరికి మరో వర్గంతో మాట్లాడారు. వారు కూడా వేస్తే మొత్తానికి కంచె వేయాలని, లేదంటే అలాగే వదలేయండి అంటూ చెప్పారు. మళ్లీ అదే విషయాన్ని బీసీల వద్ద కూడా ప్రస్తావించగా ససేమిరా అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించడంతో అడ్డుకున్న వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసి వెనుదిరిగారు. ఇప్పటికే గ్రామంలోని ఎస్సీ, బీసీలకు చెందిన ఇరు వర్గాల వారిపై కేసులు ఉన్నాయి.


గ్రామానికి చేరుకుని ప్రజలతో మాట్లాడుతున్న జెసి నవ్య





బైఠాయిస్తున్న గ్రామస్తులు

పార్టీ అజెండాతో ముందుకెళ్దాం

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - గోనెగండ్ల

పార్టీలో విభేదాలు లేకుండా పార్టీ అజెండాతో ముందుకెళ్దామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎంపీ బుట్టా రేణుక తెలిపారు. శనివారం గోనెగండ్లలో వైసిపి మండల కన్వీనర్ కెవి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నూతన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ... మండలంలోని వైసిపి కార్యకర్తలకు, ప్రజలకు ఏవైనా సమస్యలు వస్తే అందుబాటులో ఉండి మాట్లాడుకునే విధంగా కార్యాలయం ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో మండల కన్వీనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యకర్తలకు, ప్రజలకు ఎవరికెలాంటి సమస్య వచ్చినా మండలంలోని నాయకులందరూ కూర్చొని కలిసికట్టుగా మాట్లాడుకోవాలని చెప్పారు. పార్టీలో వర్గ విభేదాలు లేకుండా పార్టీ అజెండా మేరకు సమిష్టిగా పని చేయాలన్నారు. వైసిపి నాయకులు బుట్టా శివ నీలకంఠ, నాయకులు నాగేష్ నాయుడు, బందే నవాజ్, మురళీ నాయుడు, మన్సూర్, కాశిరెడ్డి, భాస్కర్ రెడ్డి, రవికుమార్ నాయుడు, చికెన్ రాజా, బగిలి రఫీ, కామర్తి పద్మనాభం, ఉస్మాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బుట్టా రేణుక

నీట్‌లో మెరిసిన విద్యార్థి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

నీట్ ఫలితాల్లో కురువ రీతు అక్షయ ఆల్ ఇండియా 8938వ ర్యాంకు సాధించారు. టిడిపి నాయకులు, కురువ సంఘం రాష్ట్ర నాయకులు కురువ మద్దిలేటి, కురువ మంజుల దంపతుల కుమార్తె రీతు అక్షయ. విద్యార్థిని ర్యాంకు సాధించడంతో మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ మల్లయ్య రీతుకు స్వీట్ తినిపించి శనివారం అభినందించారు.



నీట్‌లో ఐరన్‌బండ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - గోనెగండ్ల


సెట్టు బలిజ శివ

మండలంలోని ఐరన్ బండ గ్రామానికి చెందిన విద్యార్థి సెట్టు బలిజ శివ నీట్‌లో ప్రతిభ చూపి జనరల్ ఇడబ్ల్యుఎస్ కేటగిరిలో 1480వ ర్యాంకు సాధించారు. గ్రామంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన సెట్టు బలిజ మద్దిలేటి, సుజాత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు శివ చిన్నతనం నుంచే చదువులో ప్రతిభ కనబరిచేవారు. అతను 1 నుంచి 4వ తరగతి వరకు గోనెగండ్లలోని శ్రీరామ విద్యానికేతన్‌లో చదివారు. 6 నుంచి 10వ తరగతి వరకు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యనభ్యసించారు. ఇంటర్మీడియట్ విజయవాడ శ్రీచైతన్యలో బైపిసి 904 అత్యధిక మార్కులు సాధించారు. మే 4న నిర్వహించిన నీట్ పరీక్షలో 547/720 మార్కులు పొంది ఆల్ ఇండియా ర్యాంకు 13,673, జనరల్ ఇడబ్ల్యుఎస్ కేటగిరిలో 1480వ ర్యాంకు సాధించారు. ఎంబిబిఎస్ పూర్తి చేసి భవిష్యత్తులో యూరాలజీలో రాణించాలనేదే తన ధ్యేయమని విద్యార్థి శివ శనివారం తెలిపారు. శివ చెల్లెలు వైష్ణవి కూడా ఎమ్మిగనూరులోని ప్రయివేట్ పాఠశాలలో చదువుతూ ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో 551 మార్కులు సాధించారు.

ఆర్‌సిఎం చర్చి నుంచి పెద్ద కమేళా వరకు

రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆర్‌సిఎం చర్చి నుంచి పెద్ద కమేళా వరకు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని కెవిపిఎస్ జిల్లా నాయకులు సుమాల ఆంథోని డిమాండ్ చేశారు. శనివారం ఆ ప్రాంతంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని పాత హరిజనవాడలో ఆర్‌సిఎం చర్చి నుంచి పెద్ద కమేళా వరకు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. గత 15 ఏళ్ల నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకొనే పరిస్థితి ఉందని తెలిపారు. వృద్ధులు, పిల్లలు వర్షాకాలంలో అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలయ్యారని చెప్పారు. ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. కబరస్తాన్ ప్రాంతంలో కనీసం రోడ్లు, కాలువలు వేయకుండా ఇక్కడ కూడా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఈ రెండు ప్రాంతాలకనుగుణంగా ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి)ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టెండర్లు వేశామని.. పనులు మొదలవుతాయని మున్సిపల్ కమిషనర్ ప్రజలకు కుంటిసాకులు చెబుతున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ పాలకవర్గం స్పందించి పనులను ప్రారంభించాలని, లేకపోతే ప్రజలతో కలిసి ఆందోళనబాట పడతామని హెచ్చరించారు. కెవిపిఎస్ నాయకులు రాజు, కార్యకర్తలు బాలు, నాగేశ్, ఆంథోని, ఎం.ఇశ్రాయేలు, ఎం.నతానియేల్ పాల్గొన్నారు.



'మున్సిపల్' కళకళ...

- పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆదోని

గత పదేళ్లుగా ఉపాధ్యాయుల కొరతతో మున్సిపల్ పాఠశాలలు సతమతమవుతున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పదోన్నతులు, బదిలీలతో పాఠశాలలు కళకళలాడుతున్నాయి. నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాలతో పాటూ హాస్మియా, కల్లుబావి, కిల్చిన పేటతో పాటు అందర్ పేట్ ఉర్దూ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాల, లేబర్ కాలనీ పాఠశాలలకు రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులతో పాటు సబ్జెక్టు పాఠశాల సహాయకుల పోస్టులు మంజూరయ్యాయి. పదోన్నతుల ద్వారా భర్తీ చేయడం వల్ల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరినట్లయింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు కావడం వల్ల అధిక సంఖ్యలో మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించడంతో మున్సిపల్ ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత పాఠశాలలు ఫుల్.. ప్రాథమిక పాఠశాలలు నిల్

వెంకన్న గేరి, ఫరీద్ సాహెబ్ మొహల్లా, వడ్డే గేరి, ఓల్డ్ భార్ పేట్, భార్ పేట్, ఆది ఆంధ్ర, సయ్యద్ పేట్, గాంధీ మెమోరియల్, భార్ పేట్ హిందు బాయ్స్, అందర్ పేట్ బాయ్స్, ఆది ఆంధ్ర వంటి ప్రాథమిక పురపాలక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ల కొరత తీర్చాల్సి ఉంది. పదోన్నతులు, బదిలీలు జరగడంతో పురపాలక ప్రాథమిక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో సతమతమవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఫలితాలపై ప్రభావం ఎంత..?

గతేడాది నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలకు సంబంధించి పదో తరగతి ఫలితాల్లో దాదాపు 50 శాతం ఉత్తీర్ణత, మున్సిపల్ ఉన్నత పాఠశాలలో దాదాపు 52 శాతం ఉత్తీర్ణత సాధించారు. మరి ఈ విద్యా సంవత్సరంలోనైనా పదో తరగతి ఉత్తీర్ణత శాతం మెరుగు పడేనా అని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల భవనాల కొరత..

- టీచర్, విద్యార్థి నిష్పత్తి ఆచరణ సాధ్యమేనా..?

దాదాపు ఒక్కో తరగతికి 8 సెక్షన్ల చొప్పున దాదాపు 80 సెక్షన్లకు నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 60 సెక్షన్లకు విద్యార్థి, టీచర్ నిష్పత్తి ప్రకారం, ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఉపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి పదోన్నతులు పొందారు ఉపాధ్యాయులు. ఈ విధంగా ప్రతి సెక్షన్‌కూ ఒక తరగతి గది అవసరం. కానీ తగినన్ని గదులు లేవు. గతంలో కొందరు అధికారులు అనాలోచితంగా చేసిన పనుల వల్ల పదుల సంఖ్యలో తరగతి గదులు మొండిగోడలుగా రెండు, మూడేళ్ల నుంచి దర్శనమిస్తున్నాయి. అలాగే భాస్కర్ రెడ్డి నగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు కేవలం ఒకే ఒక తరగతి నిర్మాణం జరిగింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే ఉపాధ్యాయులతో పాటు తరగతి గదుల నిర్మాణం జరగాలి. లేకపోతే మానవ వనరులు దుర్వినియోగం జరుగుతుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా, రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులు పట్టణంలోని మున్సిపల్ విద్యా వ్యవస్థపై దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


మున్సిపల్ ఉన్నత పాఠశాల


అవార్డు అందుకుంటున్న ఉస్మాన్

కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పత్రం

ప్రజాశక్తి - గోనెగండ్ల

రెడ్ క్రాస్ సొసైటీ సీనియర్ మెంబర్, గ్రామీణ వైద్యుల (ఆర్ఎంపి) సంఘం రాష్ట్ర నాయకులు గోనెగండ్ల గ్రామానికి చెందిన ఎస్.ఉస్మాన్‌కు రెడ్ క్రాస్ సొసైటీ వారి ఉత్తమ సేవా పత్రం లభించింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం కర్నూలు నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. గ్రామీణ ప్రాంతంలో రక్తదానంపై అవగాహన, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, అత్యవసర సమయాల్లో అవసరమైన వారికి రక్తం కొరత లేకుండా చూడడం లాంటి అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు గాను ఆయన కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా పత్రంతో పాటు జ్ఞాపికను అందుకున్నారు.

నీట్ ఫలితాల్లో 'అక్షరశ్రీ' ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని


రేచల్ విక్లీఫ్

నీట్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని అక్షరశ్రీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని రేచల్ విక్లీఫ్ ప్రతిభ చాటారు. నీట్‌లో 564/720 మార్కులు సాధించారు. 7,178 ఆల్ ఇండియా ర్యాంకు రాగా, ఓపెన్ కేటగిరిలో 3,355వ ర్యాంకు వచ్చినట్లు తెలిపారు. విద్యార్థిని రేచల్ విక్లీఫ్ తల్లిదండ్రులు ఆర్ట్స్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకులుగా, ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారిగా, తల్లి సంధ్యారాణి మోటివేషన్ స్పీకర్‌గా పని చేస్తున్నారు. ఆల్ ఇండియా ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు శనివారం సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యం మేఘనాథ్ రెడ్డి అభినందించారు.

'తల్లికి వందనం'లో కోత విధించటం సిగ్గు చేటు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల సమయంలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుతం.. నేడు పాఠశాల అభివృద్ధి పేరుతో రూ.2 వేలు కోత విధించడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు విమర్శించారు. శనివారం సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం ఇచ్చే రూ.15 వేలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజులు కట్టడానికి దోహదపడతాయని చెప్పారు. ప్రతి తల్లి ఖాతాలో డబ్బులు పడతాయని చెప్పి నిబంధనలు పెట్టడం తగదన్నారు. కుటుంబ ఆదాయం గ్రామాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలలోపు ఉండాలని.. రైస్ కార్డు ఉండాలని.. ఫ్యామిలీకి మూడెకరాల్లోపు మాగాణి, లేదా 10 ఎకరాల్లోపు పొడి భూమి, లేదా రెండూ కలిపి 10 ఎకరాల్లోపు ఉండాలని.. ట్యాక్సీ, ట్రాక్టర్, ఆటో సహా ఎలాంటి ఫోర్ వీలరూ ఉండకూడదని.. విద్యుత్ బిల్లు నెలకు 300 యూనిట్లు దాటకూడదంటూ షరతులు పెట్టడం తగదని తెలిపారు. విద్యార్థుల హాజరు కచ్చితంగా 75 శాతం ఉండాలంటూ షరతులు పెడుతూ పాఠశాల అభివృద్ధి పేరుతో రూ.2 వేలు కోత విధించటం సిగ్గుచేటన్నారు. ఎలాంటి షరతులూ లేకుండా అందరికీ రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లావ్యాప్తంగా విద్యార్థులను కలుపుకొని నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఉత్తేజ్, సంజయ్, సంతోష్, లోకేష్, రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగప్ప

టీ, ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో ఎస్ఎంటి కాలనీ ఆదోని రోడ్డు.. లక్ష్మణ్ టాకీస్ ఎదురుగా వైసిపి 25వ వార్డు నాయకులు వడ్డే నాగరాజు జశ్వంత్ టీ అండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడారు. వైసిపి 25వ వార్డు నాయకులు వడ్డే నాగరాజు ఏర్పాటు ఈ రెస్టారెంట్ ద్వారా పట్టణ ప్రజలకు రుచికరమైన ఆహారం, తీయని టీ అందించాలని తెలిపారు. స్థానికంగా మంచి స్పందన లభించాలని, నూతన రెస్టారెంట్ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, జిల్లా అధికార ప్రతినిధి కె.సునీల్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు, పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం అంజి, కార్యదర్శి గౌరవ మహబూబ్ బాషా, ఎల్ఐసి ప్రభాకర్, వెంకటాపురం రాజు, మంజునాథ్, నాగేంద్ర, తిమ్మాపురం బజారి, వీరాంజనేయులు, కార్యకర్తలు అశోక్, బాషా, అజయ్, వీరాంజి పాల్గొన్నారు.


జశ్వంత్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న బుట్టా రేణుక

'బస్టాండ్ ఆధునికీకరణతో ప్రయాణికులకు సౌకర్యాలు'

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఆధునీకరణతో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని ఆర్‌టిసి కడప జోనల్ ఛైర్మన్ పోల నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మురుగుదొడ్ల ఆధునీకరణకు రూ.8 లక్షలు నిధులు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయని చెప్పారు. వివిధ ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు వంటి విషయాలపై ఆరా తీశారు. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులతో చర్చించి ప్రయాణికులకు అవసరమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కర్నూలు డిపిటిఇటి శ్రీనివాసులు, సిఎంఈ హరినాథ్ బాబు, ఎమ్మిగనూరు డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు, ఏపీడీ ఎడిసి రాజశేఖర్, డిపిటిఒ చలపతి ఉన్నారు.

హామీ నెరవేర్చిన 'కూటమి'

- జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పుష్పవతి

- చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - నందవరం

ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనం పథకాన్ని రాష్ట్ర ప్రజలకు అందించి చంద్రబాబు మాట నిలుపుకున్నారని టిడిపి నాయకులు నాగరాజు గౌడ్, ఆయన సతీమణి జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పుష్పవతి తెలిపారు. శనివారం వారి నివాస ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి 'తల్లికి వందనం' ఇచ్చిన ఘనత తమ కూటమి ప్రభుత్వానికి దక్కిందని తెలిపారు. వడ్డే గోపాల్, రహిమాన్ బాష, జగదీష్, రఫీ, నాగరాజు, హఫీజ్, నాగప్ప, వీరేష్, జిగిరి చాంద్ బాషా, ముత్తు పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

దేశాయ్ నెట్‌వర్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

రక్తదాతల దినోత్సవం

ప్రజాశక్తి - నందవరం

దేశాయ్ నెట్‌వర్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నెట్‌వర్క్ అధినేత, టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్ శనివారం నిర్వహించారు. మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, టిడిపి నాయకులు నారాయణ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఖాసీం వలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా టిడిపికి ప్రజల్లో మంచి గౌరవాన్ని తీసుకొస్తుందని తెలిపారు. గురురాజు దేశాయ్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని చెప్పారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండటం చాలా ముఖ్యమని తెలిపారు. ప్రాణాలను రక్షించే ఈ మహత్తర కార్యంలో పాలుపంచుకున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. టిడిపి ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని చెప్పారు. రక్తదాన శిబిరంలో యువత, పలువురు పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. టిడిపి నాయకులు రామకృష్ణా రెడ్డి, సత్య రెడ్డి, ఐటిడిపి నాయకులు వీరేష్, మాచాపురం మాబు హుస్సేన్, వంకగడ్డ అబ్దుల్, సుభాన్, గని, మిన్నెల్లా, ఖాసీం, వజీద్, సందీప్, షబ్బీర్, ఇబ్రహీంపురం గాలెప్ప, బండారి ప్రకాష్, కె.శివ, పోతప్ప, అజయ్, దానియేల్ పాల్గొన్నారు.


సర్టిఫికెట్ అందజేస్తున్న నాయకులు

నీటి విడుదలకు ఇండెంట్ పంపాలి

- తెలుగు రైతు జిల్లా కార్యదర్శి సాయిబాబు

ప్రజాశక్తి - ఆదోని


జలమండలి చీఫ్ ఇంజినీర్‌కు వినతిపత్రం ఇస్తున్న సాయిబాబు

తుంగభద్ర డ్యామ్ నుంచి దిగువ కాలువకు నీటిని విడుదల చేయించాలని, అందుకు కావాల్సిన ఇండెంట్‌ను పంపాలని ఎల్ఎల్‌సి నీటి వాటా పరిరక్షణ కమిటీ సభ్యులు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి సాయిబాబు కోరారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలకు కావాల్సిన నీటి ఇండెంట్ పంపాలని శనివారం జిల్లా జలమండలి చీఫ్ ఇంజినీర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 25 టిఎంసిల నీరు నిల్వ ఉందన్నారు. డ్యామ్ నీటి నిల్వ సామర్థ్యం 105 టిఎంసిలు కాగా, గతేడాది గేట్లు మరమ్మతుకు గురి కావడం వల్ల 80 టిఎంసిలకు మించి నిల్వ చేయడానికి అవకాశం లేదని విశ్రాంత నీటిపారుదల శాఖ ఇంజినీర్, ప్రభుత్వ సలహాదారు కన్నయ్య చౌదరి సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. జూన్ 25లోపు ఎల్ఎల్‌సికి నీటిని విడుదల చేయాలని రైతుల తరపున బోర్డు అధికారులను కోరగా, జల మండలి ఉన్నతాధికారుల నుంచి ఇండెంట్ పంపితే, ఎల్ఎల్‌సికి నీటిని విడుదల చేస్తామని తెలిపారని అన్నారు. ఎల్ఎల్‌సి నీటిని విడుదల చేసేందుకు సంబంధిత శాఖ జిల్లా అధికారులకు ఇండెంట్ తయారు చేసి బోర్డు అధికారులకు పంపేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. నీరు విడుదలైతే సకాలంలో సేద్యం చేసుకోవడానికి, పంటల దిగుబడి కూడా బాగా రావడానికి అవకాశం ఉందన్నారు. ఇప్పుడు నీరు విడుదల చేయకపోతే డ్యామ్ పూర్తి సామర్థ్యంతో 80 టిఎంసిలు నిండి నీరు నది ద్వారా సముద్రంలో వృథాగా కలిసిపోతుందని తెలిపారు. నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. నీరు విడుదల చేయడంతో గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను నింపుకొని నీటి ఎద్దడి లేకుండా చేసుకోవచ్చని తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించారు.

కూటమి ప్రభుత్వ ఏడాది సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తెలుగుదేశం, కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవ కార్యక్రమం కర్నూలు జిల్లా టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు వై. నర్సింహులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర టిఎన్‌టియుసి ప్రధానకార్యదర్శి ఎం. అశోక్ కుమార్,టిడిపి రాష్ట్ర నాయకురాలు డాక్టర్ సి.అరుణకుమారి హాజరయ్యారు. విజయోత్సవానికి చిహ్నంగా కేక్‌ను కట్ చేశారు. అశోక్ కుమార్, రాష్ట్ర మహిళా నాయకురాలు డాక్టర్ సి.అరుణకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గమైన జగన్ పాలనకు చరమగీతం పాడి సంవత్సరం పూర్తయిందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం పట్టం కట్టిన ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా సిఎం చంద్రబాబు నాయుడు అనుక్షణం రాష్ట్ర అభివద్ధికి పాటుపడుతున్నారన్నారు. ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. గత జగన్ ప్రభుత్వంలో బిసిలకు రిజర్వేషన్లు 24శాతం తగ్గిస్తే తిరిగి 33 శాతం పెంచి ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చారన్నారు. గత ప్రభుత్వం బిసిల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లిస్తే, నేడు బిసి. కార్పోరేషన్ నిధులను బిసిల కోసమే ఉపయోగించేలా చర్యలు చేపట్టారన్నారు. జిల్లాలో బనవాసిలో టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటు, చేనేత వస్త్రాలపై జిఎస్‌టి రద్దు, పవర్‌లూమ్సుకు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్సుకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు మంజూరు చేశారన్నారు. ఇటీవల బడ్జెట్లో బిసిల కోసం రూ.47.456కోట్లు , నాయి బ్రాహ్మణులకు వేతనాలు రూ.25 వేలకు పెంపు, గీత కార్మికులకు 10శాతం మద్యం షాపుల కేటాయింపు, మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రూ.20 వేల ఆర్థిక సహాయం, బీసీలకు మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్తును రూ.95 వేల తో ప్రభుత్వమే అందించడం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని వివరించారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి నాయకులు సోమశేఖర్ గౌడ్, శ్రీనివాసులు, రామక్రిష్ట, రమణ, చెన్నకేశవులు, రామక్రిష్ణబాబు, దివాకర్, దస్తగిరి, షాషా తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అశోక్‌కుమార్, సి.అరుణ కుమారి

జిజిహెచ్ లో రక్తదానం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసుపత్రి ఆవరణ నుండి రాజ్ విహార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, ధన్వంతరి హాలులో వివిధ సొసైటీల వారు ఎంతో మందికి రక్తదానం చేసిన వారిని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మెమొంటో ,శాలువాతో సత్కరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ రక్త దాతల చేస్తున్న సేవలను కొనియాడారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడాలని ప్రతి ఒక్కరికి పిలుపునిచ్చారు. అనంతరం రక్తదానం చేస్తే ఎంతో మందికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని అన్నారు. 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం' సందర్భంగా రక్తదానాన్ని ప్రోత్సహించండన్నారు. కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మంది రక్తం లేక చనిపోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరు విధిగా తమ రక్తాన్ని బ్లడ్ బ్యాంకుల్లో దానం చేయాలన్నారు. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, అడిషనల్ డిఎంహెచ్‌ఒ మరియు లెప్రసి టిబి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్ రాజు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డాక్టర్ కిరణ్ కుమార్, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.


రక్తదాతను సన్మానిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ చిట్టినరసమ్మ, తదితరులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-మద్దికేర

అంతర్జాతీయ యోగా మాసోత్సవం సందర్భంగా జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని మద్దికేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీ లక్ష్మి సూచించారు. ఈ సందర్భంగా శనివారం మద్దికేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో యోగ శిక్షణ శిబిరాన్ని యోగ ట్రైనర్ హెల్త్ ప్రొవైడర్ ఐశ్వర్య చే ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ సంపూర్ణ కుటుంబానికి యోగాతోనే సాధ్యమని ,ఒత్తిడి లేని జీవితం మరియు రోజువారి పనిలో యోగా ఒక భాగం కావాలని, మన దైనందిన జీవితంలో ప్రతిరోజు యోగా చేయడంతో, అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను జయించవచ్చని, మన జీవన శైలిలో మార్పులు తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్ బాబు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్ బాషా, ఫార్మసిస్ట్ జ్యోతిబాయ్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు అరుణ, మంజుల, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



నాన్నకు వందనం



నువ్వు పుడుతూనే, పరుగు పరుగున వచ్చి,
నిన్ను పలకరించి, నిన్ను ముద్దాడి,
పది మందితో ఆనందాన్ని తీపి తో పంచుకొని,
మురిసి పోయిన నాన్న అప్పుడూ ఇప్పుడూ
నీతో అదే ప్రేమ పంచుకునే నాన్న
నువ్వు నడక, మాట నేర్చి, నాన్నా అని పిలవగానే
సంబరం అంబరం అయిపోయి, నిన్ను ఆకాశానికి ఎత్తేసిన నాన్న,
అమ్మ ఒడి లో నువ్వు చేరి ముద్దు ముద్దుగా అక్షరాలు పలుకుతూ,
అక్షర మాల దిద్దు తుంటే, ఉబ్బి తబ్బిబ్బు అయిన నాన్న,
నిన్ను భుజాల మీద మోసి, తానే నీకు గుర్రమయి,
ఏనుగయ్యి, నీతో సమంగా దాగుడు మూత లాడి
నవ్వి పసి వాడిలా కేరింతలు కొట్టిన నాన్న
నీకు ఆటా పాటా నేర్పి, తానే రథం అయ్యి,
నిన్నొక రాకుమారుని లా ఉదయం సాయంత్రం
బడికీ యింటికి సవారిమోస్తూ, అదే పది వేలనుకున్న నాన్న,
నీకు కాస్త వళ్ళు వెచ్చగా అయితే హైరానా పడి
నిన్ను ఎత్తుకుని డాక్టర్ వద్దకు పరుగులు తీసిన నాన్న
నీవు పొందిన విజయాలు తానే పొందినట్లు అనుభూతి చెందుతూ,
నీవు విజయ శిఖరాన్ని చేరితే, జీవితంలో స్థిర పడితే,
తానే విశ్వ విజేత అయిన భావనతో గర్వాంగతలెత్తుకుని నిలుచున్న నాన్న
ఆ ప్రేమమూర్తి తల దించు కునేలా ఎప్పుడూ చెయ్యకు,
నాన్న పేరు నిలబెట్టి ఆ త్యాగ మూర్తి రుణం తీర్చుకో, పితృ దేవోభవ....

(జూన్15,ఆదివారం, పితృ దినోత్సవం)

- డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా కర్నూలు

7 గ్రామాల్లో గిరిజనాభివృద్ధి : కలెక్టం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 15 నుండి 30 వరకు ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ ద్వారా ఏడు గ్రామాల్లో గిరిజన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ , కనీసం 50శాతం గిరిజన నివాసితులు కలిగిన గ్రామాలలో ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో మంత్రాలయం మండలం పరమాన్ దొడ్డి, నెరణికి, హోళగుంద మండలం లోని హోళగుంద, కోగిలతోట, మద్దికెర మండలం లోని పెరవలి, మద్దికెర (తూర్పు), హంపా గ్రామాల్లో ఈ పథకం అమలు జరుగుతోందని, అక్కడి కార్య క్రమాలను చేట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గృహాలు, రోడ్లు, జల జీవన మిషన్ ద్వారా నీటి సరఫరా, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఆయుష్మాన్ కార్డులు, క్యాస్ట్ సర్టిఫికెట్లు, పెన్షన్లు, గ్యాస్ కనెక్షన్లు, కిసాన్ క్రెడిట్ కార్డ్స్, ముద్రలోన్స్, పీఎం విశ్వకర్మ వాటిని పక్కగా అమలు చేయాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తులసిదేవి, సంబంధిత మండలాల ఎంపిడిఒలు, లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులు పాల్గొన్నారు.

సి బెళగల్ మండల అధ్యక్షుడుగా సుంకన్న

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని సి.బెళగల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుంకన్న ను నియమిస్తూ నియామక పత్రాన్ని శనివారం నియోజకవర్గ కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎం ఖాద్రి పాషా, మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఎన్‌జసుంకన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు జాన్ సదానందం పాల్గొన్నారు.




తల్లి,తండ్రి, సోదరునితో నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన ఎండి సోహెల్

నీట్ ఫలితాల్లో మెరిసిన కోడుమూరు విద్యార్థి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్



జాతీయ వైద్య విద్య అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఫలితాల్లో కోడుమూరుకు చెందిన విద్యార్థి ఎస్‌కె.మహమ్మద్ సోహెల్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నీట్ ఆలిండియా జనరల్ ర్యాంక్133ను, 640 మార్కులు సాధించారు. తండ్రి కె.కమాల్ సాహెబ్, కోడుమూరు మెడికల్ డిపార్టుమెంటులో హెల్త్ సూపర్వైజర్‌గా పనిచేస్తున్నారు. తల్లి షేక్ నసీమున్నీసా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) గా పని చేస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో ఈ ర్యాంకు సాధించినందుకు సంతోషంగా ఉందని విద్యార్థి ఎస్‌కె మహమ్మద్ సోహెల్ తెలిపారు. ఇంటర్మీడియట్ శ్రీ చైతన్య కాలేజ్ హైదరాబాద్ నుంచి పూర్తి చేశారనన్నారు. పదవ తరగతి వరకు మాంటెస్వరి స్కూల్ ఏ క్యాంప్. కర్నూలో చదివారు. మంచి కార్డియాలజిస్ట్ అయి పేద ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తానని తెలిపారు.


మాట్లాడుతున్న చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి

హంద్రీనీవా లైనింగ్ పనుల కాంట్రాక్టును రద్దు చేయాలి

-హంద్రీనీవా అధికారుల నిద్రావ్యవస్థ : సిపిఎం

ప్రజాశక్తి పత్తికొండ

హంద్రీనీవా ప్రధాన కాలువ సిమెంటు లైనింగ్ పనుల్లో నాసిరక పనులు చేసిన కాంట్రాక్టర్‌ను రద్దుచేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పత్రిక విలేకరులతో సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, మద్దికేర మండల కార్యదర్శి రాముడు, సీనియర్ నాయకులు రంగారెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని విమర్శించారు. చిన్నపాటి వరద నీరుకు హంద్రీనీవా కాలువ కోతకు గురై గండిపడి సిమెంట్ లైనింగ్ ఊడిపోవడం తో అవినీతి పట్టబయలైందని అన్నారు. హంద్రీనీవా అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కుతో నాసిరకపు పనులు చేశారని అన్నారు. హంద్రీనీవా పనులను పరివేక్షించాల్సిన అధికారులు నిద్రావ్యవస్థలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకపు పనులు చేయకుండా జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నాణ్యత ప్రమాణాలతో పనులు చేసేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


-సమ్మె శిబిరంలో సమస్యలు తెలుసుకుంటున్న సందర్శించిన ఎస్‌వి విజయ మనోహరి

39వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

-సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎస్‌వి విజయ మనోహరి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీర్ కార్మికుల జీతాల పెంపుదల , ఇతర డిమాండ్లపై సమ్మె 39వ రోజులకు చేరింది. శనివారం కెడిసిసిబి మాజీ ఛైర్మన్ విజయ మనోహరి సమ్మె శిబిరాన్ని సందర్శించి ఇంజనీర్ కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు సేవలు అందిస్తున్న మున్సిపల్ ఇంజనీర్ కార్మికుల జీతాలను పెంచాలని డిమాండ్ చేశారు.వైసిపి తరఫున మీకు పూర్తి మద్దతు ఉంటుందని ఆమె తెలిపారు.